




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

ఆదివారం| 12 అక్టోబరు 2025

పేజీలు 8


## కొత్తగా ఏర్పాటు కానున్న

# ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

➲ విలీనంకానున్న నాలుగు గ్రామీణ బ్యాంకులు

**సూర్య ప్రతినిధి, కర్నూలు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా అవతరించనుంది. గత రెండ్రోజులుగా నాలుగు గ్రామీణ బ్యాంకులకు సంబంధించిన డేటా మొత్తం ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు సాంకేతిక నిపుణులు నిరంతరాయంగా పనిచేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ నెల 13వ తేదీ అనంతరం విలీన ప్రక్రియను ముగించి అధికారికంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేస్తూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారిక ప్రకటన జారీ చేస్తుందని బ్యాంకు అధికారుల మిగతా 2లో




కొత్తగా ఏర్పడనున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ (నామఫలకం)

## 16న నరేంద్రమోడీ పర్యటన

# ఖరారు


దేశ ప్రధాని నరేంద్రమోడీ

●వివరాలు వెల్లడించిన ప్రధాని కార్యాలయం


రాష్ట్ర ముఖ్యమంత్రి
నారా చంద్రబాబు నాయుడు

**సూర్య ప్రతినిధి, కర్నూలు :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను ప్రధాన మంత్రి కార్యాలయం శనివారం అమరావతి, కర్నూలు, నంద్యాల జిల్లా అధికారులకు పంపించారు. నరేంద్ర మోదీ మొదట శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబికామల్లికార్జున స్వామి వార్లను దర్శించుకొని ఆ తరువాత కర్నూలు సమీపంలోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఇటీవల తగ్గించి జీఎస్‌టి చార్జీలపై ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఒక రోజు పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన ఉదయం 7.50గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా కర్నూలు విమానాశ్రయానికి 10.20గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా శ్రీశైలం సమీపంలోని సున్నిపెంటకు 11.10గంటలకు చేరుకొని రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహానికి చేరుతారు. కొద్ది సేపు విశ్రాంతి అనంతరం అక్కడి నుంచి ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళతారు. అక్కడ 15నిమిషాలు గడిపిన అనంతరం 11.45గంటలకు శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబికామల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తిరిగి అతిథి గృహానికి చేరుకుంటున్నారు. అక్కడే మధ్యాహ్న భోజన కార్యక్రమం పూర్తి చేసుకొని తిరిగి కర్నూలుకు వెళ్లేందుకు రోడ్డు మార్గం ద్వారా సున్నిపెంటకు వెళ్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.40గంటలకు హెలికాప్టర్‌లో కర్నూలు సమీపంలోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ అధికారులు, రాజకీయ ప్రముఖులు, ఇతరులతో పరిచయ కార్యక్రమం అనంతరం మిగతా 2లో

## నూతన జాయింట్ కలెక్టర్‌గా

# నూరుల్ కమర్ బాధ్యతలు

● ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా..


ఆశీర్వాదం అందుకుంటున్న జెసి నూరుల్ కమర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా నూరుల్ కమర్ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఉదయం 10.40గంటలకు జాయింట్ కలెక్టర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. మిగతా 2లో

## చేపల వినియోగం పెంచేందుకు

# పిఎంఎంఎస్‌వై పథకం కింద యూనిట్లు మంజూరు

■ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** చేపల వినియోగం పెంచేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద యూనిట్లు మంజూరు చేయడం జరుగుతోందని రాష్ట్రపరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శనివారం నన్నూరు టోల్‌గేట్ వద్ద మిగతా 2లో


వైబ్‌ఇన్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

## నూతన జాయింట్ కలెక్టర్‌గా

# కార్తీక్ బాధ్యతలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం ఉదయం కొల్ల బత్తుల కార్తీక్ నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కల్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా సహచర అధికారులు,సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జాయింట్ మిగతా 2లో


బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన జాయింట్ కలెక్టర్ బత్తుల కార్తీక్

# శ్రీశైలం పాలక మండలి నియామకం



మంత్రి ఫరూక్‌తో జిల్లెల్ల శ్రీరాములు, శ్రీదేవి

● 16 మంది సభ్యులతో ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
● డా.సింధూశ్రీ అవుట్-ప్రత్యేక ఆహ్వానితుల జాబితాకు చెక్
● ఆమె స్థానంలో టీడీపీ సీనియర్ మహిళా నాయకులు జిల్లెల్ల శ్రీదేవి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** జ్యోతిర్లింగం మరియు అష్టదశ పీఠల్లో ప్రముఖమైన శ్రీశైలం దేవస్థానానికి కూటమి ప్రభుత్వం పాలక మండలిని నియమిస్తూ శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా 2లో

# రాబోయే మూడు,నాలుగు రోజులు పగలు,రాత్రి కష్టపడి పని చేయాలి


మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

● ప్రధాని సభా వేదిక వద్ద పటిష్ట భద్రత చేపట్టాలి
● అధికారులు,ప్రజా ప్రతినిధులు కుటుంబ కార్యక్రమంలా భావించి సమన్వయంతో ముందుకు సాగాలి
● ఒకరోజు టోల్‌ఫీజు లేకుండా ఫ్రీగా ఓపెన్ చేయాలి
● మంత్రులు టీజీ.భరత్,బిసి.జనార్ధన్‌రెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని మంత్రులు టీజీ భరత్, బిసి జనార్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఈ నెల 16న ప్రధాని మోడీ జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా మండలంలోని నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలో సభా ప్రాంగణంలోని కంట్రోల్ రూంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, ప్రధానమంత్రి స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ వీర పాండియన్‌లు మిగతా 2లో


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

సూర్య www.suryaa.com
ఆదివారం 12 అక్టోబరు 2025

# 16న నరేంద్ర మోడీ పర్యటన ఖరారు

**(మొదటి పేజీ తరువాయి)**

2.30గంటలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తారు. ఆ తరువాత సభాస్థలి వద్దకు చేరుకునే ప్రధాని సరిగ్గా సాయంత్రం 4గంటలకు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తరువాత సభాప్రాంగణం నుంచి హెలికాప్టర్ ద్వారా కర్నూలు విమానాశ్రయం చేరుకొని 5గంటలకు నేరుగా ఢిల్లీ వెళ్తారని అధికారులు స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి సభను జయప్రదం చేసేందుకు ఎన్డీఏ కూటమి నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సభకు 3లక్షలకు తక్కువ కాకుండా జనాన్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో వైపు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారి వీరపాండియన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శిరి. ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు అన్ని రకాలుగా సభకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసిన అధికారులు 13వ తేదీ సాయంత్రానికి ప్రధాని రక్షణ విభాగమైన ఎస్పీజికి అప్పగిస్తారని వెల్లడవుతోంది.

**ప్రధాని సభలో నలుగరికే ప్రసంగించే అవకాశం... పురంధేశ్వరి అనువాదం :** నన్నూరు టోల్ ప్లాజా వద్ద 16వ తేదీ ప్రధాన మంత్రి మోదీ పాల్గొనే సభలో కేవలం నలుగురికి మాత్రమే ప్రసంగించే అవకాశం ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. మొదట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, తరువాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు ప్రసంగిస్తారు. చివరగా ప్రజలనుద్దేశించి ప్రధాన మంత్రి మోదీ ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగాన్ని తెలుగులో మాజీ కేంద్ర మంత్రి, రాజమహేంద్రవరం ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి అనువదిస్తారని సమాచారం. సభలో ఇతర నేతలంతా ప్రధాని సభాస్థలికి చేరుకునే లోపే తమ ప్రసంగాలు పూర్తి చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## కొత్తగా ఏర్పాటు కానున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

**(మొదటి పేజీ తరువాయి)**

ద్వారా తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లు విలీనమై మరో రెండు మూడు రోజుల్లో ఒకే బ్యాంకుగా అవతరించనున్నాయి. సాంకేతికంగా ప్రస్తుతం ఈ నాలుగు బ్యాంకులకు సంబంధించి ఏటిఎం, క్రెడిట్ కార్డులు, యూపిఐ, ఆర్‌టిజిఎస్ వంటి సేవలు నిలిచిపోయాయి. కేవలం బ్యాంకుల్లో మాత్రమే లావాదేవీలు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరిస్తే ఏకైక గ్రామీణ బ్యాంకుగా రాష్ట్రంలో గుర్తింపు దక్కించుకోనుంది.

## నూతన జాయింట్ కలెక్టర్‌గా నూరుల్ కమర్ బాధ్యతలు

**(మొదటి పేజీ తరువాయి)**

అనంతరం మత పెద్దలు, సర్వమత ప్రార్ధనలు నిర్వహించి జాయింట్ కలెక్టర్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అధికారుల సహాయ,సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్య త అంశాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. తదనంతరం జాయింట్ కలెక్టర్‌కు జిల్లా అధికారులు తదితరులు పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు.

## నూతన జాయింట్ కలెక్టర్‌గా కార్తీక్ బాధ్యతలు

**(మొదటి పేజీ తరువాయి)**

జాయింట్ కలెక్టర్ కొల్ల బత్తుల కార్తీక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ జిల్లా పరిపాలనలో సమర్థత, పారదర్శకతను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాల ఫలితాలను ప్రజలకు చేరవేసే దిశగా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

### అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా

## చర్యలు తప్పవు - ఏఎస్పీ మందా జావలి



మాట్లాడుతున్న ఏఎస్పీ మందా జావలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల సబ్ డివిజన్‌లో రానున్న దీపావళి సందర్భంగా బాణా సంచా తయారీ, నిల్వ కేంద్రాలు, దుకాణాలలో తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మందా జావలి అల్ఫోన్స్ అన్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ షాపులను ఏర్పాటు చేసుకొని విక్రయించాలని ఆమె అన్నారు. ఫైర్ కాకర్స్ షాపుల నిర్వాహకులు ఎక్కువగా కాకర్స్ నిల్వ ఉంచినా, వాటిపై ఫైర్ సేఫ్టీ నిబందనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా, లేదా అన్న విషయంపై పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. టపాసుల విక్రయదారులు జన సంచారం ఉన్న ప్రాంతాలు, ప్రజల నివాస ప్రాంతాల్లో విక్రయాలు, నిల్వలు ఉంచరాదని అన్నారు. చిన్న పిల్లలను దుకాణాల్లో ఉంచుకోవరాదని అన్నారు. ఎవరైనా అక్రమంగా టపాసులు విక్రయిస్తే డయల్ 112, సంబంధింత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏఎస్పీ తెలిపారు.

### మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో వ్యక్తిపై

## ఫోక్సో కేసు నమోదు

**కర్నూలు క్రైమ్, మేజర్ న్యూస్ :** నగరంలోని టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికపై షేక్ కాజా బాషా అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు శనివారం ఫోక్సో కేసు నమోదు చేశారు. షేక్ కాజా భాషా అనే వ్యక్తి 2020లో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో ఐదేళు శిక్ష అనుభవించి ఇటీవల విడుదలైనట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

# రాబోయే మూడు,నాలుగు రోజులు పగలు, రాత్రి కష్టపడి పని చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఐఏఎస్ అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు ప్రధాని వస్తున్న క్రమంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మన కుటుంబంలో జరుగుతున్న ఒక కార్యక్రమంగా భావించి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రాత్రి, పగలు కష్టపడి పనిచేస్తేనే కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమన్నారు. స్థానికంగా టోల్ గేట్స్ వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఒకరోజు టోల్ ఫీజు లేకుండా ఫ్రీగా ఓపెన్ చేయాలని సూచించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధాని మోడీ సభకు సాధారణ ప్రజానీకం కూడా వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రధాని పర్యటనను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టి కృషితో విజయవంతం చేద్దామని తెలిపారు. సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శ్రీశైలం దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం మధ్యాహ్నం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారని తెలిపారు. సభకు 3లక్షల మంది ప్రజలు రానున్నందున వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్ల చేయాలన్నారు. సెక్యూరిటీ పరంగా 250సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తారన్నారు. విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడ నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, శుభ్రత, తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ డా.ఏ సిరి మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించిన పనులు పకడ్బందీగా జరగాలన్నారు. పార్కింగ్ ఏరియాలో ఫుడ్ కౌంటర్, మెడికల్ టీం,



ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

సౌండ్ సిస్టం, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కింగ్ ఏరియాలో నెంబర్‌తో సైన్ బోర్డు ఏర్పాట్లు చేయాలని కమీషనర్‌ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నేటిలోపు బారికేడింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. సభకు వచ్చిన ప్రతిఒక్కరిని తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. కొన్ని పార్కింగ్ ప్రదేశాల్లో ర్యాంప్ ఏర్పాట్లు చేయాలన్నారు. నేటి నుండి సభా ప్రాంగణం ఎస్‌పిజి వారి ఆద్వర్యంలో ఉంటుందని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఓర్వకల్ వచ్చారని 21ఏళ్ల తర్వాత కర్నూలు జిల్లాకు ప్రధానమంత్రి రానున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్, విజయ సునీత, శివ్ నారాయణ, డా.బి నవ్య, గణేష్ కుమార్, గీతాంజలి, జెసి నూరుల్ కోమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అన్నమయ్య జెసి ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, వివిధ జిల్లాల జెసిలు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల వినియోగం పెంచేందుకు పిఎంఎంఎస్‌వై పథకం కింద యూనిట్లు మంజూరు

**(మొదటి పేజీ తరువాయి)**



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వైబ్ ఇన్ రెస్టారెంట్‌లో చేపల విలువ ఆధారిత యూనిట్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ డా.ఏ సిరిలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేపల ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా మత్స్యకారులకు ఆదాయ వనరులు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపల విలువ ఆధారిత యూనిట్ల ద్వారా మత్స్య పరిశ్రమను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. స్థానికంగా లభ్యమయ్యే చేపలతో ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన వంటకాలను అందించడం ఈ రెస్టారెంట్ ప్రత్యేకతగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి మాట్లాడుతూ చేపల విలువ ఆధారిత యూనిట్‌లో భాగంగా ప్రజల్లో చేపలు, రొయ్యలు, పీతల వినియోగంపై అవగాహన కల్పించే విధంగా జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇందులో 75శాతం చేపలు, రోయ్యలు, పీతల ఐటమ్‌లు ఉంటాయని, మిగిలిన 25 శాతంచికెన్,మటన్‌లాంటివంటకాలుఉంటాయన్నారు.పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ చేపలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అందువల్ల ప్రజలు చేపలు బాగా తిని ఆరోగ్యంగా ఉండాల నే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి రెస్టారెంట్‌లు ఏర్పాటు చేయించి ప్రోత్సాహకాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. రంగనాథ్ బాబు పాల్గొన్నారు.

# శ్రీశైలం పాలక మండలి నియామకం

**(మొదటి పేజీ తరువాయి)**

17 మంది సభ్యులతో కూడిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. బిజేపీ సీనియర్ నేత పోతుగుంట రమేష్ నాయుడిని ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇదివర కే ఉత్తర్వులు జారీ చేసిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా 16 మందిని సభ్యులుగా ఎవిరమణ, బోనేని రమణమ్మ, చిట్టిబొట్ల భరద్వాజ శర్మ, లక్ష్మిశ్వేరి, గుల్ల గంగమ్మ, కోడె క్రాంతివర్ధిని, శంకర శెట్టి పిచ్చయ్య, జావలి రేఖగౌడ్, ఆలా అనిల్ కుమార్, దేవకి వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు బోడేపూడి, చిలివేరి కాశీనాథ్, మేడ మురళీధర్, ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, పి.యు.శివమ్మ, జిల్లెల్ల శ్రీదేవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాలుగు రోజుల క్రితం తెలుగుదేశం అధిష్టానం జారీ చేసిన పాలక మండలి సభ్యుల్లో నంద్యాలకు చె ందిన ప్రముఖ వైద్యురాలు సింధూశ్రీ పేరుతో జాబితా విడుదల చేసిన విషయం పాఠకులకు విధితమే. సూర్య దినపత్రిక ఈనెల 5న నామినేటెడ్ పదవిపై అధికార టిడిపిలో భగ భగ అంటూ విశ్లేషణాత్మక వార్త కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. అందులో డా. సింధూశ్రీకి టిడిపి సభ్యత్వం ఉందా, గత ఎన్నికల్లో ఆమె కుటుంబ సభ్యులు వైసీపీ విజయం కోసం పని చేశారంటూ టిడిపి తెలుగు తమ్ముళ్లు భగ్గుమంటున్నారని వెలుగులోకి తీసుకొని వచ్చింది. నంద్యాల జిల్లాలోని తెలుగు తమ్ముళ్లు ఇదే విషయాన్ని టిడిపి అధిష్టానానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందినట్లు విశ్వసనీయంగా వర్గాల ద్వారా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అత్యంత గోప్యంగా వివరాలు సేకరించి టిడిపి అధిష్టానం డా.సింధూశ్రీ స్థానంలో టిడిపి సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు సతీమణి టిడిపి సీనియర్ నాయకురాలు జిల్లెల్ల శ్రీదేవిని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టిడిపి అధిష్టానం గతంలో విడుదల చేసిన పాలక మండలి జాబితాతో పాటు అందులో నలుగురు కారుపర్తి నాగమల్లేశ్వరరావు, వేమిరెడ్డి కోటారెడ్డి, బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డిలు ప్రత్యేక ఆహ్వానితులుగా పొందుపరిచారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవోలు ఆ నలుగురు పేర్లు లేకుండానే విడుదల చేసింది. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం శ్రీశైలం పాలక మండలి నియామకానికి ప్రాధాన్యత ఇస్తూ జీవోను విడుదల చేసింది. పిఎం పర్యటనకు ముందే పాలక మండలి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద టిడిపి ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయిన పార్టీలో కొనసాగిన జిల్లెల్ల కుటుంబానికి మంత్రి ఫరూక్ అవకాశం కల్పించడంతో తెలుగు తమ్ముళ్లు సంతోషం వ్యక్తం చే స్తున్నారు. ఫరూక్‌తో పాటు ఆయన తనయులు ఎన్ఎండి ఫిరోజ్ మరియు ఎన్ఎండి ఫయాజ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


నామినేటేడ్ పదవి పై ..

అధికార టీడీపీలో భగ భగ

- శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలి నియామకంపై దుమారం
- బిసి మహిళా కోటాలో వైద్యురాలు డివి సింధుశ్రీకి పదవి
- గత ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం పని చేసిన కుటుంబసభ్యులు
- సింధూ శ్రీ టిడిపి సభ్యత్వం ఉందా! అసలు టిడిపా! వైసీపా!
- భగ్గుమంటున్న తెలుగు తమ్ముళ్లు
- తెరవెనుక చక్రం తిప్పిందెవరూ!
- పొరుగు నియోజవ ర్గం ప్రజాప్రతినిధులా! వైద్యుడా!
- ఆశావాహులను కాదని సింధు శ్రీకి కీలక పదవి

2లో

వైద్యుడు జగన్మోహన్‌రెడ్డి ఆయన సతీమణి డైరెక్టర్ సింధు శ్రీ (ఫైల్‌ఫోటో)

సూర్య వార్త కథనం

# బాణాసంచా విక్రయాలకు అనుమతులు తీసుకోవాలి

**– నిబంధనలకు పాటించకపోతే కఠిన చర్యలు**
**– డిఎస్పీ రామాంజి నాయక్**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** రానున్న దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బాణాసంచా షాపులు ఏర్పాటు చే సుకునేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డిఎస్పి రామాంజి నాయక్ అన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలో బాణసంచా విక్రయ దుకాణ



డిఎస్పి రామాంజి నాయక్

దారులు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై ప్రేలుడు పదార్థాల చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రత ఏర్పాట్ల మధ్య సరైన సూచనలు పాటిస్తు షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాణాసంచా విక్రయ దుఖాణాలు ప్రజలు నివాసముండే ప్రాంతంలో కూకుండా ఆరుబయట ప్రజలకు జననివాసాలకు దూరంగా దుఖాణాలను ఏర్పాటు చేసుకోవానానరు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలని దుఖాణ దారులకు సూచించారు. ఎవరైనా అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 112 లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. దీపావళిని ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో ప్రమాదాలకు తావులేకుండా సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆర్. నాయక్**

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా 6400 కోట్ల రూపాయలు బకాయిల్లో ఉన్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం 400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని ఆదివారం నంద్యాల ఎస్ఎఫ్ఐజిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఆర్ నాయక్ అన్నారు. శనివారం ఆళ్లగడ్డ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు ఉంటే కేవలం ఉంటే 400 కోట్లు మాత్రమే విడుదల చెయ్యడం సరికాదని పూర్తి బకాయిలు చెల్లిస్తే ఏ ఒక విద్యార్థికి సమస్య రాకుండా ఉంటుందని వారన్నారు. అదేవిధంగా 400 కోట్లు పడడంలో ఏ విద్యా వ్యవస్థ విద్యార్థుల భవిష్యత్తుకు ముందుకు సాగేటువంటి పరిణామం కనిపించట్లేదని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు ఎంతో అవస్థలు పడుతున్నాయన్నారు. విద్యార్థులకు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు కలువకుండా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఎన్నికల




సమావేశం లో మాట్లాడుతున్న నాయక్

సమయంలో చెప్పినటువంటి హామీలను అమలు చేయాలని పూర్తి రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ నాయుకులు లతీఫ్,అజయ్,సంతోష్,హర్ష,ప్రేమనందం,మధు, రాజు, రాజేష్, విగ్నేష్, జనార్ధన్, ఠాగూర్, సాయి, భరత్, సునీల్, అఫిదు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం




ప్రతిజ్ఞ చేయిస్తున్న పిడి విజయ

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పెద్దపాడు గ్రామంలోని దామోదరం సంజీవయ్య బాలికల వసతి గృహంలో శనివారం 11వ అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ పి విజయ పాల్గొని బాలికల పట్ల జరుగుతున్న అసమానతలను, వివక్షత, రక్షణ, వారి యొక్క హక్కులను అలాగే విద్య, వైద్య, పోషణ పరిరక్షించడానికి ప్రతి ఏడాది అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బాలికలు వారి హక్కులను రక్షించుకోవడానికి విద్య ద్వారానే సాధ్యమవుతుందని ఈ ఏడాది నేనే అమ్మాయి..నేనే నడిపించే మార్పు..అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ బాలమణి మాట్లాడుతూ బాలికల విద్య ద్వారానే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి వీలవుతుందని బాలికలను చదివించాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద మాట్లాడుతూ ఎవరైనా బాలలు ఆపదలో ఉన్నప్పుడు 1098లేదా 100లేదా 112లో సమాచారం అందించాలని తెలియజేశారు. అనంతరం ఆటపాటల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, నేతాజీ బేగం, విజయ, ఉమా, డిసిపియు సిబ్బంది నాగేశ్వరరావు, రంగమ్మ పాల్గొన్నారు.

## బేటీ బచావో..బేటీ పడావో ..బాలికలను రక్షిద్దాం..

**-వెల్దుర్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం**
**-కస్తూర్బా పాఠశాలలో బాలికలతో అవగాహన కార్యక్రమం -ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ లుక్**

**వెల్దుర్తి మేజర్ న్యూస్:** ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ లుక్ తెలిపారు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో కిశోర బాలికలకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం మరియు ఏదైనా




సమస్య ఎదురైనప్పుడు ఈ టోల్ ఫ్రీ నెంబర్ 1098. 181. 100 ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. బాలికలకు ఈ టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన ఇవ్వడం జరిగిందన్నారు."బాలికగా నీలోనే మార్పు– రండి ముందుకు " అనే నినాదంలో చదువు పట్ల సాధికారతతో మనము మన ఆశయాన్ని సాధించగలమనీ బాలికలకు అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి తెలిపారు.బేటి బచావో... భేటీ పడావో దీని ప్రాముఖ్యత గురించి పూర్తిగా అంగన్వాడి సూపర్వైజర్ సరస్వతమ్మ, శ్రీదేవి బాలికలకు వివరించారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించి ఎస్సే కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. బాలికలకు క్రీడలపై ఉండే వాటి ప్రయోజనాల గురించి తెలియజేసి ఆట పోటీలు జరిపి 1.2.3.వ బహుమతి బహుమతులు అందజేసినారు. అంగన్వాడి పట్టణం టీచర్స్ కస్తూర్బా పాఠశాల టీచర్స్ మాధవి, వెంకటేశ్వరమ్మ బాలికలు పాల్గొన్నారు.

**శ్రీ కామేశ్వరీ దేవి సన్నిధిలో**

## ఎక్సేంజ్ కోర్టు జడ్జి

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత బ్రహ్మగుండేశ్వర స్వామిని కర్నూల్ (డోన్ కోర్టు ఇన్చార్జి)ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎస్. అనిల్ కుమార్ మొబైల్ కోర్టు జడ్జి యస్. అనూష కుటుంబ సమేతంగా వచ్చిశ్రీబ్రహ్మగుండేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలుఅందించారు. ఆ దంపతుల ఇద్దరికీ శాలువా పూలమాలతో సత్కరించారు.



## డిప్యూటీ సీఎం స్ఫూర్తి తో సేవా కార్యక్రమాలు చేపడతాం

**-జనసేన నాయకులు మైఖేల్**





**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తి తో సేవా కార్యక్రమాలు చేపడతామని డోన్ జనసేన నాయకులు మైఖేల్ అన్నారు.శనివారం మైఖేల్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి తో కలిసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కూరగాయల మార్కెట్ దగ్గర ప్రజలకు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం వంద పడకల ఆసుపత్రిలో సూపరింటెండెంట్ హనీఫ్ తో కలిసి బాలింతలకు బ్రెడ్ ,పళ్ళపంపిణీ చేశారు.ఈ సందర్భంగామైఖేల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రతిఒక్కరు మొక్కలను నాటాలని కోరారు.పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పట్టుదల ,కృషి నేటి యువత ఆదర్శమని అన్నారు.రాబోయే రోజుల్లో జనసేన బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టిన మైఖేల్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మౌలాలి,శ్రీను మైఖేల్ మిత్ర బృందం పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలపై అవగాహన కల్పించినట్లు కేజీబివి సూపర్‌వైజర్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా పిల్లలకు రంగోలి, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో ఏలా ఉండాలని, బాల్య వివాహాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేజిబివి టీచర్ మంజుల, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

# ఎద్దుల దాడిలో బాలుడు మృతి



మృతి చెందిన బాలుడు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** అభం శుభం తెలియని బాలుడు ఎద్దుల దాడిలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూగూరు గ్రామానికి చెందిన వీరనాగప్ప ఈరమ్మ దంపతుల కుమారుడు బీరప్ప(5) అనే బాలుడు ఆడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన కాజా అనే రైతు పొలం పనుల నిమిత్తం ఎద్దుల బండిపై వెళ్తుండగా, ఆకస్మాత్తుగా ఎద్దులు బెదిరి, బాలుడిపై దాడి చేశాయి. బాలుడికి గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

## కోనవెంకటేశ్వర స్వామికి ప్రత్యేకపూజలు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన శ్రీ కోన వెంకటేశ్వరుడికి శనివారం భక్తులు విశేష పూజలందించారు.కొండపైవెలసిన సతిసమేత వెంకటేశ్వరుడు అలివేలు మంగమ్మ,భూదేవిల మూల విగ్రహాలకు భక్తులు ప్రతి శనివారం అభిషేక, ప్రత్యేక పుష్ప పత్రాలతో పూజలు నిర్వహించారు. స్వామివారికీ ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నా భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## మండలంలో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని అంగన్వాడిలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని ప్రతి అంగనవాడి కేంద్రాలలో అంగన్వాడి సూపర్వైజర్ వరలక్ష్మీదేవమ్మ బెళగల్ క్లస్టర్ సూపర్వైజర్ జరీనా భాను ఆదేశాల మేరకు భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించి,అందులో భాగంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు,బాలింతలు,బాలికలు పాల్గొన్నాగా ఈ సందర్భంగా బాలికలకు విద్య, వైద్యం, పోషణ,సంరక్షణ,రక్షణ,హింస,బలవంతపు బాల్యవివాహాలు, ఈవక్షతపై చట్టపరమైన హక్కులు పై అవగాహన కల్పించడమే అంతర్జాతీయ బాలిక దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు,బాలికలు ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసిన ఎలనార్ రుజ్‌వెల్డ్ పుట్టిన రోజైన అక్టోబర్ 11ను అంతర్జాతీయ బాలిక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి 2012న మొదటిసారి నిర్వహించింది.



# ప్రజలు ఆశించే విధంగా కూటమి పాలన లేదు..!

**-చంద్రబాబు అజెండా అంతా అమరావతిపైనే..!**
**-మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఎలా చేస్తారు**
**-12 ఏళ్లు మోడీ జీఎస్టీ పేరుతో కోట్లు దండుకొని ఇప్పుడు తగ్గగిస్తున్నాం అనడం సిగ్గుచేటు**
**-సిపిఎం కేంద్రం కమిటీ సభ్యుడు ఎం. ఏ. గఫుర్**


మాట్లాడుతున్న ఎం. ఏ. గఫుర్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** మంచి జరుగుతుందని కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రజలు అధికారంలోకి వచ్చి 15 నెలల అవుతున్న కూటమి ప్రభుత్వం ప్రజలు ఆశించే విధంగా పాలన అందించడం లేదని సిపిఎం కేంద్రం కమిటీ సభ్యుడు ఎం. ఏ. గఫుర్ అన్నారు. శనివారం ఆయనవిలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు అజెండా అంతా అమరావతి వైపు తిరుగుతుందని, పరిశ్రమల పేరుతో పెట్టుబడులు చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. రైతుల ద్వారా లక్షల ఎకరాలు తీసుకున్నారని, దీంట్లో ఎవరు పెట్టుబడి పెడతారో తెలియదన్నారు. 60 శాతం కేంద్రం నిధులు ఉన్నప్పుడు మెడికల్ కాలేజీలు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ నిర్ణయం మంచిది కాదన్నారు. మరోపక్క లక్షల కోట్లతో అమరావతి నిర్మాణం చేపడుతుంటే కేవలం నాలుగు వేల కోట్లు పెడితే పది మెడికల్ కాలేజీలు పూర్తవుతాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి వైసిపి టిడిపి పార్టీలుఅన్యాయం చేశారనిఇప్పుడు కూడా ఏమి చేయడం లేదన్నారు. జీఎస్టీ తగ్గించానని మోడీ ఏ మొకం పెట్టుకొని జిల్లాలో పర్యటనకు వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గత 12 సంవత్సరాలనుండి నుండి అధికారంలో ఉన్న మోడీ జీఎస్టీ పేరుతో కోట్లు దండుకొని ఇప్పుడు తగ్గగిస్తున్నాం అనడం సిగ్గుచేటు అన్నారు. అపద్దాలు చెబుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మారి ప్రజల మధ్యలో తిరిగి ప్రజలకు ఏమి చేయాలో ఆలోచించాలి అయన పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయంలో రికార్డుల ప్రకారమే ఆభరణాలు ఉన్నాయి



**బనగానపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** నందవరం శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయం నందు అమ్మవారి బంగారు ఆభరణాలు రికార్డుల ప్రకారమే ఉన్నాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి మరియు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి. శనివారం నాడు ఓ దినపత్రికలో చౌడేశ్వరి ఆలయంలో బంగారు ఆభరణాలు మాయం ఆభరణాలు లెక్క తెలియడం లేదని వార్త ప్రచురితమైందని అందులో వాస్తవం లేదని ఆలయంలో అమ్మవారి ఆభరణాలన్నీ రికార్డుల ప్రకారమే ఉన్నాయని తెలిపారు.

# ఆదోని జిల్లాతోనే పత్తికొండ అభివృద్ధి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** ఆదోని జిల్లా అయితే పత్తికొండ అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, న్యాయవాది బోయ క్రాంతినాయుడు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి తిరుపాలు, ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహ్మద్, సీపీఐ నాయకులు అడ్వకేట్ కృష్ణలు పేర్కొన్నారు. శనివారం ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక జీపు యాత్ర మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గంలో పర్యటించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి నాలుగు స్తంభాల కూడలి వరకు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలకు ఆదోని జిల్లా ఏర్పడితే ఐదు నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఐదు నియోజకవర్గాల్లో ఏలాంటి లాభం ఉండబోతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాలు మారుతాయన్నారు. ఈ ఉధ్యమంలో ప్రాంత ప్రజలు పాల్గొని ఆదోని జిల్లాగా సాధించుకునేంతవరకు ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా నాయకులు బోనాల కాశీ, ఆదోని జిల్లా సమితి నాయకులు నరేంద్ర యాదవ్, కుబేరస్వామి, సద్దాం హుసేన్, షకీల్, హఫీజ్, పరమేష్, ఎమ్మార్పిఎస్ నాయకులు హనుమంతు, బండారి, ఆది నారాయణ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలికల దినోత్సవం

**-బాలికలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాలలో అగ్రస్థానం**
**చేరుకోవాలి: డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** శనివారం ప్రపంచ బాలికా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, మహానంది మార్గంలోఉన్న ఎయిమ్ ఫర్సేవ బాలికల చాత్రాలయంలో లయన్స్ క్లబ్అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, ఆత్మకూరు నాగభూషణం శెట్టి చారిటీస్ చైర్మన్ ఆత్మకూరు సుదర్శనం శెట్టి సౌజన్యంతో 50 మంది బాలికలకు నిత్యావసర కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మకూరు సుదర్శనం శెట్టి మాట్లాడుతూ కుటుంబంలో బాలికలే కీలక పాత్ర వహిస్తున్నారని, అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని అన్నారు. చాత్రాలయ బాలికలకు సహకారం అందిస్తామన్నారు. డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ బాలికలను విద్యారంగంలో అందరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి అన్ని రంగాలలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు,సామాజిక సేవా సంస్థలు బాలికలను ప్రోత్సహించడానికి ముందుకు వస్తున్నాయని ఆఅవకాశాలను బాలికలుసద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగాబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సుదర్శనం శెట్టి, డాక్టర్ సహదేవుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, ఆత్మకూరు రవికుమార్,లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నిజాముద్దీన్, కోశాధికారి అమిదేల జనార్ధన్,చాత్రాలయ నిర్వాహకులు మోక్షేశ్వరుడు , చాత్రాలయ బాలికలు పాల్గొన్నారు.

# మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం - ఎమ్మెల్యే బుడ్డా

**- తన హాయంలో మోడి శ్రీశైలానికి రావడం అదృష్టం**
**- మోడి పర్యటనతో శ్రీశైల క్షేత్రానికి మహర్దశ**
**- విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**


విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**ఆత్మకూరు, మేజర్న్యూస్:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి శ్రీశైల క్షేత్ర పర్యటనను విజయవంతం చేయాలని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈనెల 16వ తేదిన ప్రధాని నరేంద్ర మోడి పర్యటన నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే స్వగ్రామం వేల్పనూరులో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ప్రధానమంత్రి పర్యటన కమిటి కన్వినర్ రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, పార్టీ పరిశీలకులు వైవి సుబ్బారెడ్డి ఆద్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కృషితో భారతదేశ ప్రధాని నరేంద్ర మోడి శ్రీశైల క్షేత్రానికి రావడం శుభపరిణామమన్నారు. ప్రధాని మోడి రాకతో శ్రీశైల క్షేత్రానికి మహ ర్ధవ రానుందని, అటవీ ప్రాంతంలో రోడ్ల విస్తరణ కానుందన్నారు. దీని వల్ల నియోజకవర్గ ప్రజలకు మేలు చేకూరుతుందని, నియోజకవర్గం ఎమ్మెల్యేగా తాను ఉన్న సమయంలో శ్రీశైల నియోజకవర్గానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ల కృషితో శ్రీశైలం దేవ స్థానం సమస్య పరిష్కారం కావడంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. టెంపుల్ కారిడార్ మంజూరుతో క్షేత్రం దిశ మారి భక్తులకు, పర్యాటకులకు అధ్యాత్మిక సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. నియోజకవర్గంలోని అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రధాన మంత్రి మోడి పర్యటనను విజయవతం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల కల్చరల్, మేజర్న్యూస్ :** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి జిల్లా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నియోజకవర్గ పరిశీలకులు ఆలం నరసింహ నాయుడులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ అక్టోబర్ 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన ఉమ్మడి జిల్లాకు మైలురాయిగా నిలుస్తుందని కూటమి ప్రభుత్వం జిఎస్టీ స్లాబులను తగ్గించి వ్యాపారవేత్తలకు, పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కల్పించడంతో పాటు ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని ఓర్వకల్లు, శ్రీశైలం ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, నిధుల విడుదల చేయనున్నారని తెలిపారు. ఈసందర్భాన్ని చారిత్రాత్మకంగా నిలబెట్టేందుకు నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, దస్తగిరి, కౌన్సిలర్లు ఖండె శ్యాంసుందర్లాల్, నాగార్జున, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, గోస్పాడు కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్లు శివశంకర్ యాదవ్, అజ్మీర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ద్వారా కుప్పంకు త్రాగు,సాగునీరు.. గిత్త

**- తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి**
**- దేశ ప్రధాని సభను విజయవంతం చేయాలి**
**- నాగలూటీ గ్రీన్ కో సోలార్ పార్కు కు కేబినెట్ ఆమోదం**
**- సోలార్ పార్క్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు**
**- ప్రధాని సభకు 50 వేల మంది ప్రజలను తరలించాలి**
**- ప్రధాని పర్యటనకు 667 ప్రత్యేక వాహనాల ఏర్పాటు**




**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** రాయలసీమ జీవ నాడి అయినా హంద్రీనీవా ద్వారా కుప్పం నియోజకవర్గానికి నీటిని తరలించి రైతులకు సాగు,త్రాగు నీరు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. శనివారం మాండ్ర స్వగృహంలో జరిగిన కూటమి పార్టీ శ్రేణుల సమావేశం మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, రాష్ట్ర పార్టీ అబ్జర్వర్ దేవల్ల మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొట్టమొదటి సారిగా రాయలసీమ పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా జరిగే జీఎస్టీ బహిరంగ సభకు నందికొట్కూర్ నియోజవర్గం నుండి అధిక సంఖ్యలో ప్రజలను తరలించి సభను విజయవంతం చేయవలసిందిగా ఎమ్మెల్యే కూటమి పార్టీ శ్రేణులకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు పిలుపునిచ్చారు. నియోజవర్గంలోని మిడుతూరు మండల పరిధిలోని నాగలూటీ గ్రీన్ కో సోలార్ పార్కు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజవర్గంలోని చదువుకున్న నిరుద్యోగులకు గ్రీన్ కో సోలార్ ఏర్పాటు వల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తిరుమల తిరుపతి దేవ స్థానం తరహాలో శ్రీశైలం ద్వాదశ జ్యోతిర్లింగం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి తెలపడం అభినందనీయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్టీని రెండు స్లాబులుగా5%, 18% తగ్గించి సామాన్యులు మధ్యతరగతి ప్రజలకు ఊరట లభించిందని ఆ ఫలితాలను వివరించేందుకే దేశ ప్రధాని ఉమ్మడి కర్నూలు జిల్లాకు విచ్చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈనెల 16వ తేదీన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆరు మండలాల నుండి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేసి ప్రజలను తరలించాలని ఆయన కూటమి పార్టీ నేతలకు , వివిధ శాఖల అధికారులకు పిలుపునిచ్చారు. ప్రధాని సభకు జన సమీకరణకు 667 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభకు వచ్చేటటువంటి ప్రజలకు త్రాగునీరు భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి మండల స్థాయి అధికారులు టిడిపి నాయకులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మరియు క్లస్టర్ ఇన్చార్జ్ లు కన్వీనర్లు, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, కాతా రమేష్ రెడ్డి,పలుచాని మహేశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, రవీంద్రారెడ్డి, లింగ స్వామి గౌడ్ , బిజెపి, జనసేన నాయకులు చల్లా దామోదర్ రెడ్డి, నల్లమల్ల రవికుమార్ , మున్సిపల్ కమిషనర్ బేబీ, ఎంపీడీవోలు, ఏపీఎంలు ,ఏపీవోలు , పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమానికి పెద్దపీఠ

- మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం
- సూపర్ జిఎస్టీ సూపర్ సేవ్ సభను జయప్రదం చేయండి
- రాయదుర్గం ఎమ్మెల్యే, మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంత్రాలయం మండల కేంద్రంలో టీడీపీ, జనసేన, బిజెపి కమిటీ సమావేశం టీడీపీ ఇంచార్జ్జి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, అబ్జర్వర్ వెంకటేశ్వర్లు, టీడీపీ ఇంచార్జ్జి రాఘివేంద్రరెడ్డి, జనసేన ఇంచార్జ్జి లక్ష్మన్న, బిజెపి ఇంచార్జ్జి విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్జీ

నడిపేందుకు కృషి చేస్తానన్నారు. ఈనెల 16న కర్నూలుకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. భారత్‌కు ప్రపంచంలోనే మంచి పేరు సంపాదించారన్నారు. నియోజకవర్గంలో సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, ఈరన్న, సతీష్ నాయుడు, లక్ష్మయ్య, చావిడి వెంకటేష్, ఆశోక్‌రెడ్డి, పవన్ కుమార్, వెంకటరాజు, జ్ఞానేష్, డిసి తిమ్మప్ప, చాపల నాగేష్ , మల్లికార్జున, రాజన్న, గొల్ల లక్ష్మి కాంత్, మోజేస్, దాసు, ఇజ్రాయిల్, నాగరాజు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అహెూ బలం సినిమా పోస్టర్, పాట ఆవిష్కరణ

-అహెూబలం సినిమా పోస్టర్ను పీఠాధిపతి చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉంది
-నరసింహ స్వామి కీర్తిని దేశ విదేశాల్లో వ్యాప్తి చేయాలన్నదే చిత్ర నిర్మాణ ముఖ్య ఉద్దేశం
-అతి త్వరలోనే సినిమా థియేటర్లలో సినిమాను విడుదల చేస్తాం
-తన పుట్టినరోజున పాటను విడుదల చేయడం తన పూర్వజన్మ సుకృతం చిత్ర నిర్మాత శెట్టి విజయ్ కుమార్




**ఆళ్లగడ్డ,మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహెూబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం అహెూబలం సినిమా పోస్టర్ ను , పాటను అహెూబిలం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా అహెూబలం సినిమా విజయవంతం కావాలని పీఠాధిపతి ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త, అహెూబిలం కాపు బలిజ అన్న సత్రం అధ్యక్షులు, చిత్ర నిర్మాత శెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ అహెూబలం సినిమాను పవిత్రోత్సవాలు చివరి రోజైన శనివారం సినిమాలోని ఒక పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ విశిష్టతను తరతరాలుగా వస్తున్న ఆచారాలను ప్రజలకు తెలియజేసే విధంగా సినిమాను తీర్చిదిద్దామన్నారు. ఆహెూ బలం సినిమా అంతా నవ నరసింహ క్షేత్రాల గురించి పూర్తిగా వివరిస్తూ, నరసింహస్వామి కీర్తిని వైభవాన్ని చాటుతూ సినిమా తీశామన్నారు. నరసింహ స్వామి కీర్తిని దేశ విదేశాల్లో వ్యాప్తి చెయ్యాలన్నదే చిత్ర నిర్మాణ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సినిమాకు సంబంధించిన పోస్టరు, పాటను పీఠాధిపతి చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నవ నరసింహ క్షేత్రాలను వివరిస్తూ పాట ఉంటుందన్నారు. ఇలాంటి పాటలు మరో రెండు ఉన్నాయన్నారు. దాదాపు సినిమా నిర్మాణం పూర్తయిందని అతి త్వరలోనే సినిమా థియేటర్లలో సినిమాను రిలీజ్ చేస్తామన్నారు.. అలాగే ఓటిటిలోకి కూడా విడుదల చేస్తామన్నారు.. ఈరోజు తన పుట్టినరోజు అని, తన పుట్టినరోజున పాటను విడుదల చేయడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. అంతకుముందు శెట్టి విజయ్ కుమార్ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు జగదీష్, కో డైరెక్టర్ అజయ్, ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవ రాయుడు తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ,ఉపాధ్యాయులు మరో ఉద్యమానికి సిద్ధంకండి

**బనగానపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజా సంక్షేమ అని చెప్పి ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని మర్చిపోయి పక్కన పెట్టిందని , ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వాలు కళ్ళు తెరిచే వరకు ఉద్యోగ ఉపాధ్యాయుల విద్య మరియు ఆర్థిక పరమైన డిమాండ్ల సాధనకై ఉద్యోగ ఉపాధ్యాయులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. మధుసూదన్ రావు జిల్లా అధ్యక్షులు బేరి మాధవస్వామి పిలుపునిచ్చారు. ఏపీ టి ఎఫ్ బనగానపల్లె డివిజన్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు జి .లింగమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలోఎం. మధుసూదన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలం ఏర్పడినప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థికపరమైన డిమాండ్ లు నెరవేర్చడంలో విఫలమైందని అందులో భాగంగా ఉపాధ్యాయుల నిరసన అక్టోబర్ 7వ తేదీన విజయవాడలోని ధర్నా చౌదరిలో దాదాపు పదివేల మంది ఉపాధ్యాయలతో ధర్నా నిర్వహించడం జరిగింది. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేనందున మరో ఉద్యమానికి ఉద్యోగ ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు బేరి మాధవస్వామి మాట్లాడుతూ దాదాపుగా 32 వేల కోట్ల ఆర్థికబకాయలు పేరుకుపోయాయని వాటిని విడుదల చేయాలని కోరారు. 12వ పి ఆర్ సి కమిటీ ఏర్పాటు చేసి ఐ ఆర్ ప్రకటించాలని కోరారు. 4 డి ఎ లు పెండింగ్లో ఉన్నాయని వెంటనే డి ఎ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పలు రకాల డిమాండ్ల సాధనకై ఉద్యోగ ఉపాధ్యాయులు మరో పోరాటానికి మరో పోరాటానికి సమాయత్తం కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి .లింగమయ్య రాష్ట్ర కౌన్సిలర్ వి. సుబ్బరాయుడు ఏపీపీఎఫ్ నాయకులు కే శేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# బైలుప్పుల షఫీవుల్లాకు గౌరవ డాక్టరేట్ పురస్కారం

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** సామాజిక సేవలో గత 35ఏళ్లుగా అనేక సాంఘీక, సంక్షేమ, సంస్కృతిక, ప్రజాహిత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిన సంఘ సేవకులు కర్నూలు జిల్లా వాస్తవ్యులు బైలుప్పుల షఫీవుల్లాకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనియవర్సిటీ వ్యవస్థాపక అధ్యక్షులు జ్ఞాన్వెల్, పుదుచ్చేరి ఐఏఎస్ ఆఫీసర్, పుదుచ్చేరి వైస్ చాన్సలర్ వెంకటేషన్, ప్రిన్సిపల్ సెక్రటరీ సంపత్ కుమార్, పుదుచ్చేరి సిటీ కమీషనర్ రాజారాంలు ముఖ్యఅతిథులుగా పాల్గొని శనివారం పుదుచ్చేరిలోని కంబన్ ఆడిటోరియంలో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందచేశారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనియవర్సిటీ వారి సామాజిక సంఘ సేవకుల గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రధాన కార్యక్రమం జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో సామాజిక సేవారంగంలో జాతీయస్థాయి గుర్తింపు పొందిన వారికి గౌరవ డాక్టరేట్ పురస్కారాలు అందచేశారు.

# మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం

- ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కు పంపిణీ



**పగిడ్యాల మేజర్ న్యూస్ :** నందికొట్కూరు మండల పరిధిలోని బొల్లవరం గ్రామానికి చెందిన బోయ పక్కిరయ్య ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి పి ఎస్ కే కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి బాధిత కుటుంబానికి పిఎస్ కే కంపెనీ వారు వర్క్ మ్యాన్ కాంపోజిషన్ క్రింద 15,50,000/- రూపాయల వచ్చే విధంగా చేసి మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ రవికుమార్, బొల్లవరం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు అందించడం అన్సర్ జూవెలర్స్ ప్రత్యేకత

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో సరసమైన ధరలకే నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు అందించడం అన్సర్ జూవెలర్స్ ప్రత్యేకత అని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాల పట్టణంలో అన్సర్ డైమండ్-గోల్డ్ జూవెలర్స్ ఎగ్జిబిషన్‌ను ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్సర్ జూవెలర్స్ నాణ్యతకు, నమ్మకాన్ని చిరునామా అని అన్నారు. నమ్మకమైన గోల్డ్, డైమండ్స్ ఆభరణాల ఎగ్జిబిషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివాహ వేడుకల సందర్భంగా సరికొత్త ఆఫర్లతో అన్సర్ జూవెలర్స్ తీసుకురావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో అన్సర్ జూవెలర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి ఫరూక్‌ను కలిసిన శ్రీశైల ట్రస్టు బోర్డు సభ్యులు





మంత్రిని సన్మానిస్తున్న శ్రీశైల ట్రస్టు బోర్డు సభ్యులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌లను శ్రీశైల దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు జిల్లెల్ల శ్రీదేవి, మేడా మురళీదర్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీదేవి, మేడా మురళీదర్‌లు శ్రీశైల దేవస్థానం అభివృద్ధి, భక్తుల సౌకర్యాలకు సంబంధించిన పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు కూటమి ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, ప్రముఖ పారిశ్రామి వేత్త పబ్బతి వేణు, తదితరులు పాల్గొన్నారు.

## దాడులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బహుజన టీచర్స్ పెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె.సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఉద్యోగికి, స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయా శాఖలది, పోలీస్ శాఖదని అన్నారు. ఉద్యోగులపై దాడులు చేయడం ఫ్యాషన్‌లా మారిందని, ఇటు రాజకీయ ఆయకులు, అటు పలు సంఘాల నాయకులు ఉద్యోగులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి చేయాన్ని ఖండించారు. ఉద్యోగులు ఏదైనా పొరపాటు, తప్పిదాలు చేసినప్పుడు చట్టపరంగా ఫిర్యాదు చేయాలని, దాడి చేయకూడదని, అలా దాడి చేస్తే చట్టపరిధిలో దోషులుగా పరిగణించబడతారని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు చేసిన, విధులకు ఆటంక పరిచినా ఏవిధంగా కేసులు నమోదు చేస్తారో అలాగే విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఉద్యోగిపై దాడి జరిగితే అలాంటి కేసులో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## గ్రామాలలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల పరిధిలోని 80- బన్నూరు గ్రామంలో ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ ప్రశాంతతకు మారుపేరు గ్రామాలని, అలాంటి గ్రామాలలో ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగించినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గ్రామస్థులకు తెలిపారు. రహదారి భద్రత, ఫోక్సో కేసులు, మహిళలపై నేరాలు, సైబర్ క్రైమ్‌పై ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఏమైనా గ్రామాలలో సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని, చట్టపరంగా సమస్యలను పరిష్కరించుకొని అందరూ మంచి వాతావరణంతో మసులుకోవాలని అన్నారు.

UGC NET
APPSC/ TSPSC DL,JL
Exams Special

# తెలుగు మాండలిక విజ్ఞానం

## సాధన ప్రశ్నలు

(గత వారం తరువాయి...)

**36.వచ్చిందు, తెచ్చిందు, ఇచ్చిందు వంటి పదాలు కనబడే మాండలికం ఏది?**

1) పూర్వమండలం 2) మధ్య మండలం
3) ఉత్తర మండలం 4) దక్షిణ మండలం

**37.'పకాలి' (గంజి అన్నం) అనే పదం ఈ మాండలిక పదం**

1)పూర్వమండలం 2) మధ్య మండలం
3) ఉత్తర మండలం 4) దక్షిణ మండలం

**38. ఒకే భాషలో గల ప్రజల వ్యవహారాల్లో వ్యత్యాసాలను ఇలా అంటారు?**

1) మాండలికం 2) అర్థ విపరిణామం
3) ధ్వని విపరిణామం 4) లోక వ్యవహారం

**39. ఎక్కువమంది ప్రజలకు సమ్మతంగా ఉండి ప్రత్యేకమైన భాషోచ్చారణకు గల పేరు**

1) ప్రామాణిక భాష
2) మాండలిక భాష
3) న్యూన ప్రామాణిక భాష
4) వర్గ మాండలిక భాష

**40. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి.**

1) మధ్యాంధ్ర మండలాన్ని మిశ్రవ్యవహార మండలమని అంటారు.
2) ప్రతీమాట వాడుకలోనూ మిగిలిన మూడు మండలాల్లో ఏదో ఒకదానితో కలవడం మధ్యాంధ్ర మాండలికం విలక్షణత.
3) డైలెక్ట్ అనే ఆంగ్ల పదానికి సమానార్థక తెలుగుపదం మాండలికం.
4) పైవన్నీ సరైనవే

**41. క్రిందివాటిలో సత్యప్రవచనాన్ని గుర్తించండి**

1) మాండలిక కోశ నిర్మాత మరుపూరి కోదండరామిరెడ్డి.
2) మరుపూరి కోదండరామిరెడ్డి మాండలిక పరిశోధక జ్ఞాని.
3) జనం ప్రధానంగా వృత్తిపై ఆధారపడతారు కనుక వృత్తిమాండలికాలు ప్రసిద్ధి చెందాయి.
4) పైవన్నీ సరైనవే

**42. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి**

1) విద్యాభివృద్ధి మాండలిక భేదాలను తగ్గిస్తుంది
2) విద్యాద్వారా ప్రామాణిక భాషావ్యాప్తి పెరుగుతుంది కనుక
3) 1, 2 రెండూ సరైనవే
4) 1, 2 రెండూ సరైనవి కావు

**43. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి**

1) వృత్తి పదకోశాలు తెలుగుకు మాత్రమే పరిమితం
2) ఇవి తెలుగులో మాత్రమే ఉన్నాయి కాబట్టి
3) 'గునాదరం' అనునది రాయలసీమ మాండలిక పదం
4) తెలుగు మాండలిక పరిశోధనలో ఆద్యుడు తూమాటి దొణప్ప


**44. క్రిందివాటిలో అసత్యప్రవచనంను గుర్తించండి**

1) ప్రతీ భాషలోనూ కుల మాండలికాలు ఉండడం మాండలికాల లక్షణం
2) రాయలసీమ, కోస్తా మాండలికాల్లో పరస్పరం ఆదాన ప్రదానాలు కనిపిస్తాయి
3) ఎందుకంటే ఈ రెండు ప్రాంతాల మధ్య భౌగోళిక సంబంధం ఉంది కనుక
4) ఒక భాషలోని పదజాలం ఆ భాష మాట్లాడే వాళ్ళ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది

**45. భద్రిరాజు కృష్ణమూర్తి గారి సంపాదకత్వంలో వచ్చిన మాండలిక వృత్తి పదకోశాలు**

1) చేనేత వృత్తి పదకోశం
2) వ్యవసాయ వృత్తి పదకోశం
3) 1 , 2 4) 2 మాత్రమే

**46. చెప్పులను ఏ మాండలికంలో 'మెట్లు' అంటారు?**




1) పూర్వమండలం 2) మధ్య మండలం
3) ఉత్తర మండలం 4) దక్షిణ మండలం

**47. క్రిందివాటిలో ఏది భిన్నమైనది?**

1) మదుం 2) పూడిసిందు
3) భోగట్టా 4) నక్కు

**48. క్రిందివాటిలో సరైన అంశాన్ని గుర్తించండి**

1) మాండలికాల సరిహద్దులను గుర్తించడానికి 'మాండలిక పటాలు' ఉపయోగపడతాయి
2) ధ్వనులను ప్రధానంగా చేసుకొని గీచిన పటాలను 'ఫొనెటిక్ అట్లాసు' అంటారు
3) మాండలిక పటాలలో ప్రధానంగా కనిపించేవి 'వ్యవహార విభజన రేఖలు'.
4) పైవన్నీ సరైనవే

**49. 'మండలం' అనేది ఏ భాషాపదం?**

1) కన్నడ 2) ఉర్దూ
3) సంస్కృతం 4) మరాఠీ

**50. క్రిందివాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి**

1) మండలము అనగా అర్థం 'దేశ భాగము'
2) ఒక జాతి ప్రజలను కానీ, సంఘాన్ని కానీ మండలం అంటారు
3) జిల్లా, రాశి, సమూహం, గుంపు అనేవి మండలానికి పర్యాయ పదాలు
4) పైవన్నీ సరైనవే

**51. మాండలికాన్ని 'మాండలిక భాష' అని వ్యవహరించినవారు ఎవరు?**

1) భద్రిరాజు కృష్ణమూర్తి
2) వేదం వేంకటరాయ శాస్త్రి
3) లంకసాని చక్రధరరావు
4) చిలుకూరి నారాయణరావు

**52. మాండలిక భాష కు పర్యాయ పదాలను గుర్తించండి**

1) ఉపభాష 2) ప్రాదేశిక భాష
3) ప్రాంతీయ భాష 4) 1, 2 , 3

**53. మాండలికాల వల్ల ప్రయోజనాలేవి?**

1) మాండలికాలు భాషకు సజీవ చిహ్నాలు.
2) భాషా స్వరూపాన్నీ, భాషా చరిత్రనూ మాండలికాలు వల్ల తెలుసుకోవచ్చు
3) మాండలికాలు భాషకు సౌందర్యాన్ని, వైవిధ్యాన్ని పెంపొందిస్తాయి
4) పైవన్నీ సరైనవే

**54. ప్రజల మధ్య వ్యవహార ప్రాభల్యం సన్నగిల్లడం వల్ల ఏర్పడే మాండలికాలు**

1) సామాజిక మాండలికాలు
2) చారిత్రక మాండలికాలు
3) ప్రాంతీయ మాండలికాలు
4) జీవశాస్త్రానుసార మాండలికాలు

**55. ఈ మాండలికాలను 'స్థల మాండలికాలు' అంటారు**

1) సామాజిక మాండలికాలు
2) ప్రాంతీయ మాండలికాలు
3) చారిత్రక మాండలికాలు
4) జీవశాస్త్రీయ మండలికాలు

**56. వ్యక్తులు పుట్టి పెరిగిన ప్రాంతాల ఆధారంగా ఏర్పడిన మాండలికాలు**

1) సామాజిక మాండలికాలు
2) ప్రాంతీయ మాండలికాలు
3) చారిత్రక మాండలికాలు
4) జీవశాస్త్రీయ మాండలికాలు

**57. వర్గ మాండలికం, కుల/వర్ణ మాండలికం, వైయుక్తిక మాండలికం అనేవి ఈ మాండలికం పరిధిలోకి వస్తాయి**

1) సామాజిక మాండలికాలు
2) ప్రాంతీయ మాండలికాలు
3) చారిత్రక మాండలికాలు
4) జీవశాస్త్రీయ మాండలికాలు

**58. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి**

1) భారతదేశంలో మాత్రమే కులమాండలికాలు ఉన్నాయి.
2) ప్రపంచంలో ఏ ఇతర భాషలో కూడా కులమాండలికాలు లేవు
3) 1,2 రెండూ సరైనవే
4) రెండూ సరికావు

**59. 'త్రాసు' పదం ఇక్కడ కనిపిస్తుంది**

1) నన్నయ భారతంలో
2) తిక్కన భారతంలో
3) ఎఱ్ఱన భారతంలో
4) మారన మార్కండేయ పురాణం

**60. త్రాసు పదానికి మరోరూపం 'తరాజు'. ఈ తరాజు పదం ఈ మండలంలో కనిపిస్తుంది**

1) ఉత్తర మండలంలో
2) పూర్వ మండలంలో
3) దక్షిణ మండలంలో
4) మధ్య మండలంలో

**జవాబులు**

36)3 37)1 38)1 39)1 40)4
41)4 42)3 43)3 44)1 45)3
46)4 47)2 48)4 49)3 50)4
51)2 52)4
53)4 54)3
55)2 56)2
57)1 58)3
59)2 60)2



సుమన్ సేపాన, M.A,B.Ed
విషయ నిపుణులు
శ్రీకాకుళం జిల్లా

## ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైంటేబుల్ -2026

ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి, సెకండ్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమై 10వ తేదీతో ముగుస్తాయి.

**ఏపీ ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల షెడ్యూల్ 2026**

ఫిబ్రవరి 23న లాంగ్వేజ్ పేపర్ 1
ఫిబ్రవరి 25న ఇంగ్లీష్ పేపర్ 1
ఫిబ్రవరి 27న హిస్టరీ పేపర్ 1
మార్చి 2న మ్యాథ్స్ పేపర్ 1
మార్చి 5న బయాలజి పేపర్ 1
మార్చి 7న ఎకనామిక్స్ పేపర్ 1
మార్చి 10న ఫిజిక్స్ పేపర్ 1
మార్చి 12న కామర్స్ పేపర్ 1
మార్చి 14న సివిక్స్ పేపర్ 1
మార్చి 17న కెమిస్ట్రీ పేపర్ 1
మార్చి 20న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ / లాజిక్ 1 పరీక్ష
మార్చి 24న మోడ్రన్ లాంగ్వేజ్ / జియోగ్రఫీ 1



**ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల షెడ్యూల్ 2026**

ఫిబ్రవరి 24న లాంగ్వేజ్ పేపర్ 2
ఫిబ్రవరి 26న ఇంగ్లీష్ పేపర్ 2
ఫిబ్రవరి 28న హిస్టరీ / బోటనీ పేపర్ 2
మార్చి 3న మ్యాథ్స్ పేపర్ 2 ఎ / సివిక్స్ 2
మార్చి 6న జువాలజి 2 / ఎకనామిక్స్ 2
మార్చి 9న మ్యాథ్స్ పేపర్ 2 బి
మార్చి 11న ఫిజిక్స్ / కామర్స్ / సోషియాలజీ / మ్యూజిక్ 2
మార్చి 13న ఫిజిక్స్ 2
మార్చి 16న మోడ్రన్ లాంగ్వేజ్ / జియోగ్రఫీ 2
మార్చి 18న కెమిస్ట్రీ 2
మార్చి 23న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ / లాజిక్ 2

# ఏచోట ఉన్నా..నీవెంటరానా..!!

★నాడు ఉరేసుకున్న సెల్ఫీ పంపిని ప్రియురాలు.. ఆత్మహత్య చేసుకున్న ప్రియుడు
★ప్రియుడులేరని తెలుసుకున్న ప్రియురాలు నిన్న ఆత్మహత్య
★ఇద్దరూ.. ఇద్దరే.. జన్మనిచ్చిన పిల్లల సంగతేంటి..?
★నాలుగురోజులుగా శోకసంద్రంలో గువ్వలదొడ్డి గ్రామం


ధనుంజయ గౌడ్, శశికళ (ఫైల్ ఫోటోలు)

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఉన్న ఊరిలో ఒకరిని ఒకరు ఇష్టపడ్డారు.. కులాలు వేరు అయినా.. వారిపెళ్లికి అమ్మాయి వయస్సు మాత్రమే అడ్డు చెప్పింది.. ప్రియురాలు వయసు పెద్దది కావడంతో పెళ్లికి అంగీకరించలేదు. ఇద్దరికి వేరొక్కరితో వివాహాలు జరిపించారు. అయిన వారి మధ్యలో ప్రేమ మాత్రం చావలేదు. ప్రియుడిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ ప్రియురాలు సామాజిక మాధ్యమంలో తను ఉరి వేసుకునట్లు సెల్ఫీ ఫోటో పంపింది. ఇందుకు మనస్తాపానికి గురైన ప్రియుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రియురాలు సైతం ఏచోటానీవున్న..నీవెంటనేరానా అంటూ అదే పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్లితే.. ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన ధనుంజయ గౌడ్ ( 27) అదే గ్రామానికి చెందిన శశికళ అనే మహిళతో ప్రేమలో పడ్డాడు. ఇద్దరు మనసు ఒకటైన శశికళ వయసు రెండేళ్లు పెద్దది కావడంతో ఇద్దరు పెద్దలు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో శశికళను మరొకరికి ఇచ్చి వివాహం చేశారు. శశికళకు ఇద్దరు సంతానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఇటీవల శశికళ భర్త తన పిల్లలను వదిలేసి ప్రియుడు ధనంజయగౌడ్ చెంతకు చేరింది. ఇది తెలుసుకున్న ధనుంజయగౌడ్ భార్య కూడా భర్తను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రియురాలు అయిన శశికళను ఎమ్మిగనూరు ఓ ప్రైవేట్ వసతి గృహంలో ఉంచాడు. అయితే శశికళ తనను పెళ్లి చేసుకొని ఇంటికి తీసుకెళ్లాలని ఒత్తిడి చేస్తూ వచ్చింది. ఈ నెల 6వ తేది ధనుంజయగౌడ్ చరవాణికి సామాజిక మాధ్యమంలో తను ఉరి వేసుకొని చనిపోతున ట్లు సెల్ఫీ తీసుకొని పంపింది. ప్రియురాలు మృతి చెందితే తనపై కేసులు పడుతాయని ఆందోళన చెంది పోలంలో పురుగుల మందు సేవించి ధనుంజయగౌడ్ నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. ప్రియుడు మరణించిన తన జీవితం ఎందుకని ప్రియురాలు కూడా పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నంకుపాల్పడింది. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శశికళ మృత్యుఒడికి చేరుకుంది. ప్రేమ జంట మరణ వార్తతో నాలుగు రోజుల నుండి గువ్వలదొడ్డి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. శశికళ ఇద్దరు పిల్లలు అమ్మలేని అనాథలు అయ్యారు. భర్తను నమ్ముకొని వచ్చిన ధనుంజయగౌడ్ భార్య వితంతు అయింది. ఇద్దరు ప్రేమికులను కలవడంతో పెద్దలు విఫలం చెందడం కొందరి జీవితాలను నిండు జీవితాలను ముంచేసింది. ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

# మహాధర్నాను జయప్రదం చేయండి



**ఆదోని, మేజర్ న్యూస్ :** విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని విద్యుత్ జేఏసి కన్వీనర్ చైర్మన్ కేటి రుద్రప్ప, లక్ష్మన్నలు పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే తెలంగాణ ప్రభుత్వ తరహాలో రెగ్యులర్ చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో విలీనం చేసి ఏపి ఎస్పిడిసిఎల్ రూల్స్ వర్తింప చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి నాలుగు డిఏలను వెంటనే ఇవ్వాలని, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని వర్తింప జేయాలని, విద్యుత్ సంస్థలో 1999 నుండి 2004 వరకు రెగ్యులరైన ఉద్యోగులందరికి ఈపిఎఫ్ నుండి జిపిఎఫ్‌లోకి వర్తింపజేయాలని, డిప్లొమా, డిగ్రీ, బిటెక్ చదివి అర్హత కలిగిన కార్మికులందరికి కన్వర్షన్ ఇవ్వాలని, తదితర డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే ఈనెల 15వ తేదిన నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈనెల 13న విజయవాడలో ధర్నా చౌక్‌కు వేలాదిమంది విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు జగ్గయ్య నాయక్, శివ, చిరంజీవి, సుబ్రహ్మణ్యం, చెన్నయ్య, భాస్కర్, ప్రేమ్ కుమార్, జనార్ధన్, శ్రీనివాసులు, శేఖర్ , తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ ఇంట్లో చోరీ

★ భారీ మొత్తంలో దోచుకెళ్లిన దొంగలు


బీరువాను పగలగొట్టిన దుండగులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ముగతి పేటలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ ఇంట్లో చోరీ జరిగింది. భారీ మొత్తంలో దొంగలు దోచుకెళ్లారు. పట్టణ పోలీసులు ఫిర్యాదు దారుడు తెలిపిన ఆధారంగా కేసు నమోదు చేసుకున్నారు. వివరాల్లో వెళ్లితే ముగతిపేటలో ఆటో డ్రైవర్ యూనుస్ తన భార్యకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆదోనిలో చికిత్స కొసం నాలుగు రోజులుగా వెళుతూ వస్తున్నాడు. ఇంటిలో ఎవరులేని సమయంలో శనివారం దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న 12 తులాల బంగారంతో పాటు 1కేజీ వెండి, 70 వేల నగదును దొంగలు దోచుకెళ్లినట్లు బాధితుడు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ వి. శ్రీనివాసులు నదరు విషయంలో క్లూస్‌టీంను రప్పించి పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

# గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

-రోడ్డు వేసి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించండి
-ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బరగోడ్ల హుస్సేన్ బాషా



గుంతలమయంగా మారిన రోడ్డు . పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలి నుండి కడప హైవే ఎక్కే మార్గంలో శోభ ఘాట్ నుండి దోస హౌస్ వరకు ఉన్న రోడ్డు చాలా గుంతలతో ప్రమాదకరంగా మారిందని ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బరగోడ్ల హుస్సేన్ బాషా అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు చాలా మంది కిందపడి గాయాలు అవుతున్నాయనీ ఈ విషయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మార్వోకి, కమిషనర్ కి, ఎంపీడీవో కి ముగ్గురికి గతంలో తెలియజేయడం జరిగిందన్నారు. దీంతో ఆగస్టు 19వ తేదీన పై పైన తారు వేశారని, వేసి కనీసం రెండు నెలలు కూడా కాలేదని రోడ్డు అంతా గుంతలమయమైంది అన్నారు. పర్మినెంట్ రోడ్డు వేయమంటే తూతు మంత్రముగా తారు వేశారన్నారు. ఆళ్ళగడ్డ నగరపంచయతి నుండి మునిసిపాలిటి అయిన మునిసిపాలిటికి సంబంధించి ఎటువంటి సౌకర్యాలు లేవని విమర్శించారు. శనివారం ఒక లారీ ఇరుకొని చివరకు 5000/- పెట్టి జేసిపితోబయటకితీయవలసివచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ ప్రాంతంలో రోడ్డును వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి శంషల్ హాక్ తదితరులు ఉన్నారు.

# ఆపద సమయంలో అండగా శక్తి యాప్


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఆపద, అత్యవసర సమయంలో మహిళలు, విద్యార్థినీలకు శక్తియాప్ అండగా ఉంటుందని కర్నూలు సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు ఎస్ఎం భాష, బి చిన్న రాజులు అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సిఐ విజయలక్ష్మిల ఉత్తర్వుల మేరకు శనివారం నగరంలోని బిక్యాంపులో సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో బాలికలు, మహిళల రక్షణ కొరకు శక్తి యాప్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో 112, 181, 1098, 1930లకు ఫోన్ చేయాలన్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలు, సమాజంలో ఆడపిల్లలు ఏ విధంగా నడుచుకోవాలి, ఫోక్సో చట్టంగురించి తెలియజేశారు. లీగల్‌అడ్వైజర్‌డా. రాయపాటి శ్రీనివాస్, మౌనిక, చెన్నమ్మ, రజిని తదితరులున్నారు.

# పెద్దపాడులోని సమస్యలు పరిష్కరించాలి


ఎస్‌సి కాలనీలో చేరిన నీటిని చూపుతున్న సిపిఎం నాయకులు

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దపాడులో ప్రజల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం శాఖ కార్యదర్శి గోపినాథ్ ఆధ్వర్యంలో శనివారం శాఖ సభ్యులు, పార్టీ కార్యకర్తలు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనేక సమస్యలు గుర్తించారు. ముఖ్యంగా గ్రామానికి ఆనుకుని ఒడ్డోని వంక ప్రవహిస్తుందని, రియల్ ఎస్టేట్ వారు వంకను పూడ్చి ప్లాట్లు వేయడం జరిగిందని వంకను పూడ్చడం వల్ల వంకలో వెళ్లవలసిన నీరు గ్రామంలోని ఎస్‌సి కాలనీలోకి వస్తున్నాయన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ఎస్‌సి కాలనీలోని ఇళ్లలోకి నీళ్లు వచ్చి నీటి కుంటను తలపిస్తుందన్నారు. ఎస్‌సి కాలనీలో హాస్టల్ కూడా ఉందని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదని ప్రజలు వాపోయారు. ఇవే కాక గ్రామంలో ఇంకా అనేక సమస్యలు తిష్ట వేశాయని ప్రజలు సిపిఎం దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి నాగరాజు, పరశురాముడు, రాము, చిరంజీవి, హుస్సేన్, సంజీవ, మునిస్వామి, నాగేశ్వరరావు, మహేశ్వరి, సుంకులమ్మ, వరాలు, నాగమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులకు స్వాగతం పలికిన కమీషనర్


స్వాగతం పలుకుతున్న కమీషనర్

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి శనివారం కర్నూలు నగరానికి విచ్చేసిన మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు డా.పి సంపత్ కుమార్ ఐఏఎస్‌ను నగరంలోని ఓ హోటల్ వద్ద నగరపాలక సంస్థ కమీషనర్ పి విశ్వనాథ్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

# శాంతిరామ్‌లో సమన్వయ సిగ్మా 2కె25

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 15వ జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సదస్సు సమన్వయ సిగ్మా 2కె 25 రెండో రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎంవి సుబ్రహ్మణ్యం తెలిపారు. వావ్ టాలెంట్ షోలో విద్యార్థులు తమ ప్రతిభను మెరిసే విధంగా ప్రదర్శించారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించినట్లు తెలిపారు. మొత్తం 632మంది విద్యార్థులు వివిధ ఈవెంట్లలో రిజిస్ట్రేషన్ చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతి ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థుల ఉత్సాహం, ప్రదర్శన కళాశాల వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చింది. కళాశాల ఛైర్మన్ శాంతిరాముడు, ప్యాట్రన్ ఇంజి ఎం శివరామ్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఫరూక్, రమాదేవి, డేవిడ్ తదితరులు సమన్వయించారు.



విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్

# పేదలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్ ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శనివారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. లబ్దిదారులు కాపు రమాదేవి రూ.42,136, తిరుపతి పాపారాయుడు (డెత్) రూ.4,60,505లు, భైరెడ్డి క్షత్రపతి రెడ్డి రూ.79,079ల చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు.


లబ్దిదారులకు చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే

సూర్య www.suryaa.com

ఆదివారం 12 అక్టోబరు 2025

# బిట్ కాయిన్ పెట్టుబడుల పేరుతో మోసాలు

**:- ఎస్పీ విక్రాంత్ పాటిల్**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** బిట్ కాయిన్ పెట్టుబడుల పేరుతో మోసాలు జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బిట్ కాయిన్, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శనివారం తెలిపారు. బిట్ కాయిన్‌లో రూ.5వేలు పెట్టుబడి పెడితే మూడు గంటల్లోపే రూ.1లక్ష అయ్యింది, కావాలంటే కింద ఉన్న స్క్రీన్ షాట్‌లు చూడండి అంటూ కొత్త నంబర్లు లేదా తెలిసిన వ్యక్తుల నంబర్ల నుండి మీకు లింకులు వస్తున్నాయా..అయితే జాగ్రత్త అది సైబర్ నేరగాళ్ల పనేనని గుర్తించాలన్నారు. తొలుత లాబాలు వచ్చినట్లు చూపించే నేరగాడు భారీగా సొమ్ము పెట్టాక తిరిగి తీసుకునేందుకు వీలు లేకుండా చేస్తాడని, ఖాతా నిర్వహించే అసలు వ్యక్తికి ఫోన్ చేసినప్పుడు మోసపోయామని బాధితులు గుర్తిస్తున్నారన్నారు.

# పీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఫరూక్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కర్నూలు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా సభ ఏర్పాట్లను మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, టిటిడి పాలక మండల సభ్యులు మల్లెల రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని రాగమయూరి వద్ద సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ప్రధాని స్పెషల్ ప్రోగ్రాం ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, జిల్లా కలెక్టర్ డా.ఏ సిరిలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఐఏఎస్ అధికారి, జిల్లా కలెక్టర్‌లతో మాట్లాడుతున్న మంత్రి

# వాట్సాప్‌లో 'వెంకన్న దర్శన' టికెట్లు

**★ 9552300009 నెంబర్ ద్వారా అందుబాటులోకి మొబైల్ సేవలు**

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవంగా చెప్పుకునే శ్రీశ్రీనివాసుడి దర్శన టికెట్లు వాట్సాప్ నుండి బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. 95523 00009 వాట్సాప్ నెంబర్‌ను మొబైల్‌లో సేవ్ చేసుకుని 'హాయ్' అని మెసేజ్ పెడితే చాలు మీకు కావలసిన సేవల ఆప్షన్లు ప్రత్యక్షమవుతాయి. ఇందులో 'ఆలయ బుకింగ్ సేవలు' ఆప్షన్‌లోకి వెళితే ఏడుకొండల స్వామి దర్శన టికెట్లను పొందే అవకాశం ఉంది. దర్శన టికెట్లు, సేవా రిజర్వేషన్లు, వసతి, ఇతర సేవలను బుక్ చేసుకునేందుకు వీలుగా చాట్‌బాట్ సూచనలు ఇస్తుందని ప్రభుత్వం తెలిపింది. స్లాటెడ్ సర్వదర్శనంతోపాటు సర్వదర్శనం, శ్రీవాణి కౌంటర్ స్టేటస్ డిపాజిట్, రీఫండ్, లైవ్ స్టేటస్ ఆప్షన్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలోని ఏ ఆలయ టికెట్‌నైనా ఇక్కడి నుండి బుక్ చేసుకోవచ్చు. వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో అనేక రకాల సేవలను మొబైల్‌లో అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు టిటిడికి సంబంధించిన నాలుగు సేవలను వాట్సాప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి తెచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. దర్శన టికెట్లు బుక్ చేసుకోవడంతో పాటు స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ సెంటర్స్ సమాచారంతో పాటు అందుబాటులో ఉన్న టికెట్ల వివరాలు, సర్వదర్శనం క్యూలైన్ ఏ మేరకు ఉంది? శ్రీవారి దర్శనానికి ఎన్ని గంటలు పడుతోంది? శ్రీవాణి టికెట్లకు సంబంధించిన సమాచారం వంటివి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా భక్తులు పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది.

# చైన్ స్నాచర్ అరెస్టు, రిమాండ్

**:- రూ.1లక్ష నగదు, స్కూటీ స్వాధీనం**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఓ మహిళ మెడలో గొలుసు అపహరించుకెళ్లిన గణేష్ నగర్‌కు చెందిన చైన్‌స్నాచర్ కారంపొడి రాజారెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.1లక్ష నగదు, ఏపి 40ఏఏ 6515 స్కూటీని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు 3వ పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ ఏడాది జనవరి నెల 5వ తేదీన వెంకటాద్రి నగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ మెడలో నుంచి చైన్ అపహరించుకుపోయిన చైన్‌స్నాచర్ కె రాజారెడ్డిని శనివారం నంద్యాల రోడ్డులో టివి టవర్ దగ్గర పారిపోతుండగా పట్టుకుని అతని వద్ద నుండి రూ.1లక్ష నగదు, స్కూటీని స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించిందని తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన రాజారెడ్డి నగర శివారులోని నిర్మానుష ప్రాంతాల్లో మహిళల మెడలో గొలుసు దొంగతనాలకు పాల్పడి వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడని పోలీసులు తెలిపారు.

# జేసీని ఆశీర్వదించిన వేదపండితులు



జేసీని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కార్తీక్‌కు మహానంది వేదపండితులు వేద ఆశీర్వచనాన్ని అందించారు. శనివారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో మహానంది దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చండూరి రవిశంకర అవధాని, హనుమంతరాయ శర్మలు వేద ఆశీర్వచనాన్ని అందించి మహానందీశ్వర స్వామివార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య ఉన్నారు.

# గ్యాస్‌లీక్ ప్రమాదంలో భార్య,భర్త,చిన్నారి మృతి

**-గ్యాస్ లీక్ ప్రమాద ఘటనలో నిన్న చిన్నారి చరణ్ మృతి**

**-తండ్రి కుమారుడు అంత్యక్రియలు మరవకముందే భార్య బండ సువర్ణ కోలుకోలేక మృతి**



బండ సువర్ణ (ఫైల్ ఫోటో)



బండ నాగరాజు (ఫైల్ ఫోటో)



చరణ్ చికిత్స పొందుతు మృతి చెందిన ఫోటో

**వెల్దుర్తి ,వెల్దుర్తి రూరల్ ,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎస్.బోయనపల్లె గ్రామంలో గత సోమవారం ఒంటి గంట ప్రాంతంలో బండ నాగరాజు ఇంట్లో గ్యాస్ లీకైన ఘటనలో నలుగురు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయ పడిన సంఘటన పాఠకులకు తెలిసిందే, క్షత గాత్రులు వారం రోజుల క్రితం నుండి కర్నూల్ ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు, బండ నాగరాజు 40 కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. శుక్రవారం రాత్రి చిన్నకుమారుడు చరణ్ మృతి చెందాడు, శనివారం ఎస్. బోయినపల్లి గ్రామంలో బండ నాగరాజు కుమారుడు చరణ్ మృతదేహాలకు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.మృతుని భార్య సువర్ణ ఆరు నెలల నిండు గర్భిణీ కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కడుపులోనిబిడ్డ చనిపోవడంతో శుక్రవారం అబార్షన్ చేయడం జరిగిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చికిత్స పొందుతున్న బండ సువర్ణ శనివారం కర్నూల్ ప్రభుత్వ హాస్పటల్లో కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెద్ద కుమారుడు అనిల్ కొద్దిపాటి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఒకే ఇంట్లో బండ నాగరాజు బండ సువర్ణ కుమారుడు చరణ్ ముగ్గురు చనిపోయిన కూడా గ్యాస్ ఏజెన్సీ అధికారులు,జిల్లా అధికారులు, మండల అధికారులు కుటుంబ సభ్యులను పరామర్శించకపోవడం చాలా బాధాకరమని మండల, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే ఇంట్లో పురిటి గర్భిణీతో పాటు భర్త బండ నాగరాజు కుమారుడు చరణ్ చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు నెలల కాలం వ్యవధిలో మూడు నాలుగు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇంత జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండి పోతున్నారు.ఏది ఏమైనా జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో గ్యాస్ లీక్ పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంలో గ్యాస్ ఏజెన్సీ వారు పూర్తిగా విఫలం చెందారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బండ నాగరాజు కుటుంబాన్ని గ్యాస్ ఏజెన్సీ వారు రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందోవేచి చూద్దాం..

# ఈతకు వెళ్ళి వ్యవసాయ విద్యార్థి మృతి

**- విద్యార్థి మృతిపై అనుమానాలు ..!**

**- సిబ్బంది నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమా..?**



మృతి చెందిన విద్యార్థి జనార్థన్‌నాయక్



జనార్థన్ నాయక్ (ఫైల్ ఫోటో)

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది వ్యవసాయ కళాశాలలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. శనివారం కళాశాల సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జనార్ధన్‌నాయక్ (21) అనే విద్యార్థి ఈతకు వెళ్ళి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. శనివార శెలవు దినం కావడంతో తోటి విద్యార్థులతో కలిసి వ్యవసాయ కళాశాల ఆవరణంలోని పాలేరు వాగు బ్రిడ్జి వద్ద బట్టలు ఉత్తుకున్న అనంతరం ఈతకు వెళ్ళగా జనార్థన్‌నాయక్ నీటిలో మునిగి పోయాడని తోటి విద్యార్థులు గమణించి ఆ విద్యార్థిని బయటకు తీసి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడని వారు తెలిపారు. ఈ విద్యార్థిది చిత్తూరు జిల్లా పీలేరు సమీపంలో జిల్లెల్ల గ్రామం వద్ద ఉన్న తాండా అని తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు.

**సిబ్బంది నిర్లక్ష్యమేనా..?:** మహానంది వ్యవసాయ కళాశాలలో విద్యార్థి మృతి చెందిన సంఘటనపై సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి నిత్యం సిబ్బంది పర్యవేక్షణలో ఉండాల్సిన విద్యార్థులు విచ్చల విడిగా తిరుగుతున్నారని, వారిని గాలికి వదిలేశారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నారు. కళాశాల వద్ద యూనివర్సిటీ స్థాయి సిబ్బంది ఉండాల్సి ఉండగా సిబ్బంది ఎవరూ అక్కడ లేరు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపంతో కళాశాలలో ఏమి జరుగుతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విద్యార్థి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా పోలీస్ విచారణలో నిజాలు నిర్ధారణ కావాల్సి ఉంది.

# శిథిలావస్థలో పశువైద్యశాలలు

**- భయంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది**


**- నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని పశుపోషకుల వినతి**





శిథిలావస్థలో చేరిన పశువైద్యశాల

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని కల్లుదేవకుంట, మాధవరం గ్రామాల్లో ఉన్న పశువైద్య శాలలో శిథిలావస్థ దశకు చేరుకున్నాయి. కల్లుదేవకుంట పశువైద్య శాలకు చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామాల రైతులు తమ పశువులను వైద్యం నిమిత్తం తీసుకొస్తుంటారు. కల్లుదేవకుంట పరిధిలో 750 తెల్లపశువులు, 200 బర్రెలు, 3,500గొర్రెలు మేకలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మాధవరం గ్రామం పశువైద్యశాలకు రచ్చుమర్రి, రాంపురం, బసాపురం కాగల్, కాచాపురం, మాధవరం, తుంగభద్ర, నారాయణపురం గ్రామాల నుంచి పశువులను వైద్యం నిమిత్తం ఈ ఆసుప త్రికి తీసుకొస్తుంటా రు. ఈ గ్రామాల్లో 3212 ఆవులు, ఎద్దులు, 1214 గేదేలు, 9,434 మేకలు, గొర్రెలు ఉన్నాయని పశు వైద్యాధికారులు సంతోష్ కుమార్ తెలిపారు. ఈ వైద్యశాలలో గత 40సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం గదుల్లోని స్లాబులు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఇందులో పని చేసే సిబ్బంది భయాందోళనకు గురైనప్పుడు గాయపడ్డ పశువులను వ్యాక్సిన్‌ల కోసం ఇక్కడికి తరలిస్తారు. ఇక్కడ వసతులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. నూతన పశువైద్య శాలలను నిర్మించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. మంత్రాలయం మండలం సూగూరు గ్రామంలో పశువైద్యశాల లేకపోవడంతో చావిడిలోని చిన్న రూమ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, రైతులకు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఈ గ్రామంతోపాటు బూదూరు గ్రామం కూడ దీని పరిధిలోకి వస్తుందని, కానీ పశువైద్యశాలను నిర్మించాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు. నాయకులు, అధికారులు స్పందించి పశుశాలను నిర్మించాలని కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న స్లాబులు